
ఆంధ్రజ్యోతి
*** గరిష్ఠం 28.0 కనిష్ఠం 23.4
ANDHRAJYOTHY



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	585.90 (300.3015)	3,37,687	3,16,516
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.20 (3.74)	6,277	1,244
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.21 (41.54)	4,07,855	4,35,518


చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.176 | స్కిన్‌లెస్ : రూ.200

ఇక్కడా అక్రమబద్ధీకరణే



జిల్లాలో ఇంటర్ అధ్యాపకులుగా క్రమబద్ధీకరణ పొందినవారిలో నకిలీ ధ్రువపత్రాల వ్యవహారాలు ఒక్కోటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 11 మంది లెక్చరర్లు వేర్వేరు మార్గాల్లో నకిలీ పత్రాలతో కొలువులు పర్మినెంట్ చేసుకున్నారనే నిర్దిష్టమైన ఫిర్యాదులపై విచారణ సాగుతుండగా, తాజాగా రాష్ట్రంలోనే ప్రత్యేకమైన ఏకైక డఫ్ అండ్ డమ్ (చెవిటి, మూగ) విద్యార్థులకు ఉద్దేశించిన లెక్చరర్ల రెగ్యులరైజేషన్‌లోనూ అవకతవకలకు పాల్పడ్డట్లు ఫిర్యాదులు వెళ్లాయి. వీటిపైనా విచారణ అటకెక్కించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. - (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

- డఫ్ అండ్ డమ్ అధ్యాపకుల నియామకాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు
- కీలక అధికారుల అండ ఉందనే ఆరోపణలు
- విచారణను అడ్డుకుంటున్నారని విమర్శలు



డఫ్ అండ్ డమ్ విద్యార్థులకు ఇంటర్ విద్య అందించేందుకు జిల్లాలోని మిర్యాలగూడ జూనియర్ కళాశాలలో రెండు అదనపు సెక్షన్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ హెచ్‌ఈసీ, సీజీఏ గ్రూపులు కొనసాగుతున్నాయి. ఈ గ్రూపు విద్యార్థులకు బోధించేందుకు అవసరమైన నియామకాలను కూడా సక్రమ పద్ధతిలో చేయకుండా వివాదాలకు ఆస్కారమివ్వడంపై ఉన్నతాధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే వేర్వేరు పద్ధతుల్లో అధ్యాపకులుగా కొనసాగుతున్న వారిలో గత ఏడాది జరిగిన క్రమబద్ధీకరణలో నలుగురిని రెగ్యులరైజ్ చేయగా, వారిలో ముగ్గురు అనర్హులేనని, వారిపై చర్యలు తీసుకోవాలని ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా, ప్రయోజనం లేకుండా పోయిందని విద్యార్థిసంఘాల నాయకులు వాపోతున్నారు.

ఆదినుంచీ ఫిర్యాదులే..

మిర్యాలగూడలోని డఫ్ అండ్ డమ్ కళాశాలలో నియమితులైన అధ్యాపకులపై మొదటి నుంచి వివాదాలు, ఫిర్యాదులు ఉన్నాయి. తాజాగా క్రమబద్ధీకరణలోనూ అవే వివాదాలు ఉన్నాయి. క్రమబద్ధీకరణ నిబంధనల ప్రకారం 2014కు ముందే ఈ పోస్టులకు కావాల్సిన అర్హతలు పొంది, పనిచేస్తున్న అధ్యాపకుల జాబితానే పంపాల్సి ఉంటుంది. కాగా, ప్రస్తుతం కొనసాగుతున్న అధ్యాపకుల్లో ముగ్గురికి ఆ తేదీ నాటికి అర్హతల్లేకున్నా జాబితాలో చేర్చడంలో ఉన్నతాధికారులు, కీలక అధికారుల ప్రమేయం ఉందనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ ప్రత్యేక సెక్షన్ల అధ్యాపకుల నియామకానికి 2011లో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం జరిగిన ఇంటర్వ్యూల్లోనే అర్హతలను పట్టించుకోకుండా నియమించారనే ఆరోపణలు ఉన్నాయి. వాటిపైన ఫిర్యాదులు సైతం రాగా, విచారణ ఏమైందనే విషయం నేటికీ తేలలేదు. ఈ సబ్జెక్టులు బోధించేందుకు పీజీతో పాటు, స్పెషల్ బీఈడీ తప్పనిసరి. అదేవిధంగా బధిరులకు బోధించాల్సి ఉండడంతో రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీసీ) సర్టిఫికెట్‌తో పాటు, సెంటర్ రిజిష్టర్ రిజిస్ట్రేషన్ నెంబర్ తప్పనిసరి. ఈ నియామకాల సమయంలో సదరు అధ్యాపకులెవ్వరికీ ఈ అర్హతలు లేవు. వీరిలో ఒకరు తప్పుడు ధ్రువీకరణ తేవడంతో గతంలోనే అప్పటి జాయింట్ కలెక్టర్ ఈ నియామకాన్ని తోసిపుచ్చారు. అయినా, ఆ తర్వాత ఉద్యోగంలో కొనసాగారు. ఆయన 2005లో బీఈడీ (స్పెషల్), 2007లో సీఆర్ఆర్, ఆర్‌సీఐ నమోదు చేసుకున్నట్టు ఆ సమయంలో పేర్కొన్నారు. కానీ, ఆర్‌సీఐ రెన్యువల్ కాలేదు. నిబంధనల ప్రకారం ఆర్‌సీఐ ప్రతి ఐదేళ్లకోసారి రెన్యువల్ చేయించుకోవాలి. అయితే అతను 2012 నుంచి 2021 వరకు రెన్యువల్ చేయించుకోలేదు. కేవలం కలర్ జిరాక్స్ ద్వారా ఈ సర్టిఫికెట్‌ను అందజేసి ఉద్యోగంలో కొనసాగినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై విద్యార్థి సంఘాల నాయకులు ఆర్టీఐ ద్వారా సర్టిఫికెట్ల జెన్యునిటీ ప్రశ్నించడంతో అప్పటికప్పుడు ఏడాదికాలం దూరవిద్యలో ఆర్‌సీసీ, సీఆర్ఆర్ సర్టిఫికెట్ నమోదు చేయించుకున్నారు. ఓ వైపు అధ్యాపకుడిగా కొనసాగుతూ, మరో వైపు దూరవిద్యలో అభ్యసించడం చట్టపరంగా చెల్లదని, ఈ నియామకమే చెల్లదనే వాదన విద్యార్థిసంఘాలు చేస్తుండగా, తాజాగా జరిగిన క్రమబద్ధీకరణలో దర్జాగా సర్టిఫికెట్ల ద్వారా రెగ్యులరైజ్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మరో అధ్యాపకుడి నియామకమూ ఇలాగే ఉందనే విమర్శలు ఉన్నాయి. అతడు 2011లో నియామకమైనప్పుడు కేవలం పీజీ మాత్రమే చేశాడని, ఆతర్వాత సెలవు పెట్టకుండానే దూరవిద్య ద్వారా స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ పూర్తిచేశారని, ఇదెలా సాధ్యమని, విధుల నుంచి తొలగించకపోగా, ఈ సర్టిఫికెట్ల ఆధారంగా క్రమబద్ధీకరించడమేంటనే ఫిర్యాదులు వచ్చాయి. మరో అధ్యాపకుడు 2011లో ఇంటర్వ్యూకు రాకుండా, తదుపరి గెస్ట్ అధ్యాపకుడిగా చేరి, కాంట్రాక్ట్ లెక్చరర్‌గా మారి, తాజాగా క్రమబద్ధీకరణ పొందారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. అతడు కూడా చేరిన సమయానికి స్పెషల్‌ఎడ్యుకేషన్ బీఈడీతో పాటు ఇతర అర్హతలు సాధించలేదు. ఎలాంటి సెలవులు లేకుండానే 2015లో స్పెషల్ బీఈడీ పూర్తిచేయగా, 2012 నుంచి 2016 వరకు ప్రతిష్ఠాత్మక యూనివర్శిటీలో ఫుల్‌టైమ్ విద్యార్థిగా పీహెచ్‌డీ చేశారు. ఆ సమయంలో ఇక్కడ స్కాలర్‌షిప్ కూడా పొందారు. ఆయన ఒకే సమయంలో ఇక్కడ ఉద్యోగం, డిస్టెన్స్‌లో స్పెషల్ బీఈడీ, మరోవైపున రెగ్యులర్ పీహెచ్‌డీ విద్యార్థిగా ఎలా కొనసాగుతారని, ఇన్ని తప్పులు చేసినా క్రమబద్ధీకరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తంగా ఈ ముగ్గురికి తాజా నిబంధనల ప్రకారం 2014కు ముందు అవసరమైన అర్హతలు లేవని, ఈ నిబంధననైనా చివరకు పాటించి ఉంటే గౌరవప్రదంగా ఉండేదని, అలాంటివేవీ లేకుండా ఇష్టానుసారంగా వీరిని క్రమబద్ధీకరించారని పలువురు ఆరోపిస్తున్నారు. అయితే ఫిర్యాదు చేసినా, విచారణ చేసి చర్యలు తీసుకోకుండా కీలకమైన అధికారులే అడ్డుపడుతున్నారని, వీరికి అండగా వారే నిలుస్తుండడంతో విచారణ ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. జూనియర్ లెక్చరర్ల క్రమబద్ధీకరణలో మొత్తంగా పలుతప్పిదాలు జరిగాయని, సమగ్ర విచారణ చేస్తే మరిన్ని విషయాలు, అక్రమాలు వెలుగులోకి వస్తాయని, ఉన్నతాధికారులు ఈ అంశాలపై విచారణకు ఆదేశించాలని పలువురు అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

అర్హులైన రైతులందరికీ పాస్ పుస్తకాలు

సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 3: తమ భూమిలో కాస్తులో ఉంటూ సేద్యం చేసుకుంటున్న అర్హులైన ప్రతీ రైతుకు పట్టా పాస్ పుస్తకాలు అందుతాయని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నాయకుని తండా,నెల్లికల్ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మండలంలో ఉన్న పలురకాల భూ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో పైలట్ ప్రాజెక్టుగా మండలాన్ని ఎంపిక చేసిందన్నారు. ఈక్రమంలోనే వివిధ ప్రాంతాల రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు వచ్చి రైతుల భూముల్లో సర్వే చేస్తున్నారన్నారు. రైతులు వివాదాలకు తావు లేకుండా సర్వేకు సహకరించాలన్నారు. రైతులు సహకరిస్తేనే పైలట్ ప్రాజెక్టు విజయవంతమవుతుందన్నారు. మండలంలో ప్రధానంగా ప్రభుత్వ, కాందిశీకుల, అటవీ భూముల సమస్యలున్నట్లు అధికారులు గుర్తించారని తెలిపారు. ఈ సందర్భంగా రైతుల కబ్జాను నిర్ధారించేందుకు వారి పొలాల వద్దకే సర్వేయర్లు వస్తున్నారని, వారు సాగు చేస్తున్న భూమికి నిర్ధారించి ఆమేరకే పాస్ పుస్తకాలు ఇస్తారని చెప్పారు. అదేవిధంగా సాగర్ ప్రాజెక్టు ముంపు తండాలు, గ్రామాల్లో ఉన్న సమస్యలు కూడా పరిష్కారమవుతాయని హామీ ఇచ్చారు. గతంలో పునరావాసం కింద ఇచ్చిన రైతుల భూములకంటే రైతులు ఎక్కువ భూమిలో సేద్యం చేస్తున్నారని సర్వేలో తేలుతుందని, అందుకనుగుణంగా మిగిలిన వారికి పట్టా పాస్ పుస్తకాలు ఎలా ఇవ్వాలో అధికారులు నిర్ణయిస్తారన్నారు. కాందిశీకుల భూములను సేద్యం చేస్తున్న రైతులకు పాస్ పుస్తకాలను, హక్కులను కల్పించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. రైతులకు సర్వే అంశంపై ఏమైనా సందేహాలుంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, గడ్డం సాగర్‌రెడ్డి, రమావత్ కృష్ణానాయక్, చింతల చంద్రారెడ్డి, మెరావత్ మునినాయక్, శౌరినాయక్, శ్రీనునాయక్, హచ్చునాయక్, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ విపత్తును ఎదుర్కొనేందుకు కృషి

- వర్షాలతో దెబ్బతిన్న చెరువులు, కుంటలకు మరమ్మతులు చేయాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, మఠంపల్లి, సెప్టెంబరు 3: రాష్ట్రంలో ఏర్పడిన భారీ విపత్తును ఎదుర్కొనేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని మట్టపల్లి బైపాస్‌రోడ్డు, సింగారం రోడ్డు, గోవిందాపురం కల్వర్టు, శివాలయం వీధి, మినీ ట్యాంక్‌బండ్, దద్దనాల చెరువు కాలనీ, సహకార సంఘంలో తడిసిన ఎరువులు, దెబ్బతిన్న ఇళ్లు, రోడ్లు, పంటలను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పంట నష్టపోయిన రైతులకు అండగా ఉంటామన్నారు. పాక్షికంగా ఇళ్లు దెబ్బతిన్న వారికి రూ.10వేలు సహాయం అందజేస్తామన్నారు. పంటనష్టంపై అధికారులు అంచనా వేయాలన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమగ్ర సర్వే చేయాలన్నారు. నియోజకవర్గంలో చెరువులు, కుంటలు దెబ్బతినగా సీఎం మంజూరు చేసిన నిధులతో వెంటనే వాటికి మరమ్మతులు చేయాలన్నారు. ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలోని నల్లచెరువుకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. పంట పొలాల్లో ఇసుక మేటలు వేయ గా వాటిని పరిశీలించారు. హుజూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలించిన అనంతరం జిల్లా చీఫ్ ఇంజనీర్‌తో ఫోన్‌లో మాట్లాడి నీటిపారుదల శాఖ ఏఈ తుమ్మల శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీచేశారు. హుజూర్‌నగర్‌లోని ట్యాంక్‌బండ్‌ను తప్పుడు ప్రణాళికతో నిర్మించి వరదకు కారణమైన ఏఈని సస్పెండ్ చేయాలన్నారు. ట్యాంక్‌బండ్ నిర్మాణ సమయంలోనే ప్లానింగ్ మార్చాలని చెప్పినప్పటికీ వరద నీటిని చెరువులో నుండి కాలువ ద్వారా శివాలయం వీధిలోకి వదలడంతో శివాలయం, గంగమ్మ దేవాలయం, గోవిందాపురం రోడ్డులోని ఇళ్ళన్నీ మునిగాయని మంత్రి ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఏఈపై ఆగ్రహం వ్యక్తంచేసిన మంత్రి సీఈని సస్పెండ్ చేయాలని ఆదేశించారు.



మఠంపల్లి మండలం మామిళ్ల చెరువు పరిశీలనకు ట్రాక్టర్‌పై వెళ్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి మండలంలో చెరువు కట్టలకు గండిపడి నష్టపోయిన రైతులను, ఇళ్లు కూలిపోయిన బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. మఠంపల్లి మండలంలోని చౌటపల్లి ఊర చెరువు, అలుగు, మఠంపల్లి ఎస్సీకాలనీలో బాధిత కుటుంబాలను, రఘునాథపాలెం గ్రామంలో ముంపునకు గురైన కాలనీ, ధ్వంసమైన రోడ్డు, గుండ్లపల్లి, చౌటపల్లి లిఫ్టును, మామిళ్ల చెరువుకు పడిన గండిని, చెన్నాయిపాలెం వద్ద వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన పంట పొలాలు, కల్వర్టులను ఆయన పరిశీలించారు.

ఇది ప్రభుత్వం సృష్టించిన విలయం

- మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి
- ఎడమకాల్వ గండిని పరిశీలన



ఎడమకాల్వకు గండితో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మాజీ మంత్రులు హరీ‌ష్‌రావు, జగదీ‌ష్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, తదితరులు

నడిగూడెం, సెప్టెంబరు 3: నడిగూడెం వద్ద ఎడమకాల్వకు గండిపడటం, పంటలు కొట్టుకుపోవడం ప్రకృతి సృష్టించిన విలయం కాదని, ఇది ప్రభుత్వం సృష్టించిన విలయమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి ఆరోపించారు. మాజీ మంత్రి హరీ‌ష్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్ శాసనసభ్యులు, మాజీ మంత్రుల బృందం నడిగూడెం మండలం కాగిత రాంచంద్రాపురం వద్ద రెండు చోట్ల గండి పడిన ప్రదేశాలను మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా జగదీ‌ష్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం సృష్టించిన విలయం కారణంగా రైతులు పంట నష్టపోవడమేగాక, మరో రెండు పంటలు సాగుచేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆపత్కాలంలో రాజకీయాలు చేయాల్సిన అవసరం తమ పార్టీకి లేదన్నారు. ప్రజలకు ధైర్యం చెప్పాల్సిన ముఖ్యమంత్రి రెండు రోజులు పత్తా లేకుండాపోయి తన తప్పును దాచిపెట్టుకునేందుకు కేసీఆర్‌పై, బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారన్నారు. చావుకు కూడా తేడా తెలియని పరిస్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారని, ఓదార్చ కొచ్చారో సంబరాలకు వచ్చారో ఆయనకు అర్థం కావడం లేదన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు నీళ్ల తీసుకుపోయేందుకు కాల్వ కట్టపై పోలీసులను పెట్టి తూముల గేట్లకు వెల్డింగ్ చేయడంతోనే కట్ట కొట్టుకుపోయిందని అన్నారు. ప్రజలను గాలికి వదిలేసి ముఖ్యమంత్రి, మంత్రులు జల్సాల్లో మునిగితేలుతున్నారని ఎద్దేవా చేశారు.

ఓటర్ నమోదు ఆన్‌లైన్‌లో వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



ఓటర్ ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

హాలియా, సెప్టెంబరు 3: ఓటర్ నమోదు ప్రక్రియను బీఎల్‌వోలు వేగవంతం చేయాలని నాగార్జున సాగర్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం అనుముల మండలంలో ఇంటింటి సర్వేలో బీఎల్‌వోలు చేస్తున్న ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుముల మండలంలో 36,324 మంది ఓటర్లున్నారని, 9,376 మందిని ఇప్పటివరకు ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకు మండలంలోని 44 పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్‌వోలు అందరూ ఇంటింటికీ తిరిగి ఆధార్ లేని వారికి ఆధార్ సేకరణ, ఫోన్‌లేని వారికి ఫోన్ నెంబర్ సేకరణ, పేర్లు తప్పులు, ఒప్పులులాంటివి ఆన్‌లైన్ యాప్‌లో సవరణలు చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ జయశ్రీ, బీఎల్‌వోలు అక్బర్, విజయ, నర్మద తదితరులున్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేదికపై కలెక్టర్

చండూరు, సెప్టెంబరు 3: సమీకృత భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి ఆయన మునిసిపాలిటీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరిశీలించిన అనంతరం చండూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చండూరు మునిసిపాలిటీలో పారిశుధ్యం లోపించడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు చేపట్టాలని, ఖాళీ స్థలాల్లో పెరిగిన మొక్కలను తొలగించాలని యజమానులకు నోటీసులు ఇవ్వాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతుందని, విద్యార్థుల సంఖ్య పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. గ్రామాలు, మునిసిపాలిటీల్లో శిథిలావస్థకు చేరిన డ్రైనేజీలను గుర్తించి, వాటి స్థానంలో కొత్తగా నిర్మించి మురికినీరు సాఫీగా వెళ్లిపోయేలా చూడాలన్నారు. మునిసిపాలిటీలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములు, అక్రమ నిర్మాణాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వసతి గృహాల్లో విద్యుత్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్‌శాఖకు రూ.197కోట్లు మంజూరయ్యాయని విద్యుత్ అధికారులు తెలపడంతో ప్రాధాన్యతా క్రమంలో విద్యుత్ పనులు చేయాలని, చండూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చాలని ఆదేశించారు. చండూరు రెవెన్యూ డివిజన్ అయినందున ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో ఇతర ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా సమీకృత భవన నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, ప్రతీ ప్రభుత్వ నిర్మాణం భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ శానిటేషన్ విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, మరో నెల రోజులపాటు వైద్యాధికారులు, సిబ్బంది గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా చూడాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా కృషి చేయాలన్నారు. రాబోయే 15 రోజుల్లో తర్వాత మునిసిపాలిటీలో పారిశుధ్యం మెరుగుపడితే, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచందర్, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, చండూరు ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ దశరథ, చండూరు సీఐ వెంకటయ్య, మునిసిపల్ కమిషనర్ మున్వర్‌అలీ, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

మునుగోడు: ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నాంపల్లి మండలంలో చేపట్టే అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.



నక్కలగండి రిజర్వాయర్‌కు

భారీగా వరద

దుందుభి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వస్తున్న వరద

•7లో..

కస్తూర్బా పాఠశాలను

తరలించాలి

ఆదర్శపాఠశాల విద్యార్థినుల ఆందోళన

ఎమ్మెల్యే హామీతో నిరసన విరమణ

నీలగిరికి స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ అవార్డు

- జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలిచిన పట్టణం
- ఈ నెల 7న జైపూర్‌లో అవార్డు అందుకోనున్న మునిసిపల్ చైర్మన్



రామగిరి, సెప్టెంబరు 3: స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో నల్లగొండ మునిసిపాలిటీ దేశంలోనే రెండో స్థానం దక్కించుకుంది. మూడు లక్షల లోపు జనాభా ఉన్న మునిసిపాలిటీలను పర్యావరణం, అటవీ, వాతావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం(ఎన్‌సీఏపీ) నెల రోజుల క్రితం నల్లగొండ మునిసిపాలిటీ పరిధిలో స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ సర్వే నిర్వహించింది. ఎన్‌సీఏపీ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ మార్గదర్శకాలకు అనుగుణంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి 131 నగరాల్లో నిర్వహించిన స్వీయ అంచనా నివేదికలను సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు (సీపీసీబీ) నివేదించింది. నివేదికను పరిశీలించిన బోర్డు నల్లగొండ మునిసిపాలిటీ అత్యుత్తమ పనితీరు కనబర్చడంతో ఎంపిక చేసి, స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌కు రెండో స్థానంలో నిలిచినట్లు ప్రకటించింది. ఈ నెల 7వ తేదీన రాజస్థాన్‌లోని జైపూర్ ఎగ్జిబిషన్ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న స్వచ్ఛ వాయు దివస్ కార్యక్రమానికి నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ హాజరుకానున్నారు. పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి, రాజస్థాన్ ముఖ్యమంత్రి నుంచి వీరు పురస్కారం అందుకోనున్నారు.

పురస్కారం రావడం హర్షణీయం



స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో నల్లగొండ మునిసిపాలిటీకి జాతీయ స్థాయిలో రెండో స్థానం దక్కడం హర్షించదగ్గ విషయం. పట్టణ అభివృద్ధి కోసం అదనంగా నిధులు వచ్చే అవకాశం కూడా ఉంది. నల్లగొండ మునిసిపల్ పరిధిలో స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌పై సర్వే నిర్వహించిన అధికారులకు సరైన నివేదిక అందించిన మునిసిపల్ అధికారులను కూడా అభినందించాలి.

- బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్

టెన్నిస్‌కు వయస్సు అడ్డుకాదంటూ...

భువనగిరి టౌన్, సెప్టెంబరు 3 : ఐటీఎఫ్ వరల్డ్ మాస్టర్ టూర్-100 సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్ యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ఉత్సాహంగా కొనసాగుతోంది. క్రీడాకారులు గెలుపుకోసం మైదానంలో చెమటోడుస్తున్న తీరు అబ్బురపరుస్తోంది. 30 నుంచి 75సంవత్సరాలు పైబడిన 10 కేటగిరీల్లోని స్త్రీ, పురుషుల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ సుమారు 100మంది వెటరన్ క్రీడాకారులు పోటీపడుతున్నారు. చివరి రోజైన బుధవారం పలు కేటగిరిలలో ఫైనల్స్ జరుగనున్నాయి.



● ఒకరి వెంట మరొకరుగా



వాసుదేవరెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పైగా టెన్నిస్ క్రీడాకారుడు. భార్య సునీత గృహిణి.వాసుదేవరెడ్డి ఉద్యోగం నుంచి రాగానే రాకెట్ పట్టుకుని టెన్నిస్ కోర్టుకు వెళ్లేవాడు. ఓ రోజు భర్తతో పాటు సునీత టెన్నిస్ కోర్టుకు వెళ్లింది. ఈ క్రమంలో ఆమె కూడా ఆటలో ప్రావీణ్యం పొందింది. దీంతో భార్యాభర్తలిద్దరూ మిక్స్‌డ్ డబుల్స్ ఆడుతూ టెన్నిస్ దంపతులుగా పేరుగాంచారు. పలు విజయాలు సాధించారు. వారి పిల్లలిద్దరు కూడా టెన్నిస్ ఆడుతూ రాణిస్తుండటంతో కుటుంబంలో టెన్నిస్ ఓ భాగమైంది. వారి ఇంటి నిండా రాకెట్స్, బాల్స్, ట్రోఫీలు ఉంటాయని ఆ దంపతులు తెలిపారు.

కూతురు కోసం వెళుతూ..



నా కుమార్తె సాహిత్యకు టెన్నిస్ అంటే చాలాఇష్టం. ప్రస్తుతం ఆమె కృష్ణ యూనివర్సిటీ క్లబ్ మెంబర్. అయితే క్రీడాకారులు అందుబాటులో లేని సమయంలో ఆమె ఒంటరిగా టెన్నిస్ ఆడేది. దీంతో ఆమెను ప్రోత్సహించేందుకు నేను ప్రత్యర్థిగా మైదానంలో ఆడేదానిని. క్రమంలో నేనూ టెన్నిస్ క్రీడాకారిణిగా ప్రతిభ చూపే స్థాయికి ఎదిగా. ప్రస్తుతం నా వయస్సు 49 ఏళ్లు. ఇప్పటివరకు పలు పతకాలు సాధించా.గతంలో జర్నలిజం వృత్తిలో ఉన్న, ప్రస్తుతం హైదరాబాద్ యూనివర్సిటీలో హిందీ విభాగంలో పనిచేస్తున్నా.

శ్రీ జ్ఞానమూట్, హైదరాబాద్.

టెన్నిస్‌కు వయస్సు అడ్డంకి కాదు



ప్రస్తుతం నా వయస్సు 77 ఏళ్లు. 14 ఏళ్ల వయసు నుంచే ఆడుతున్నా. మా ఇంట్లో నాలుగు తరాలు కలిసి టెన్నిస్ ఆడుతుంటాం. మా అందరి ఆరోగ్య రహస్యం టెన్నిస్ ఆడటమే. వెటరన్ టెన్నిస్ సిరీస్‌లో 75 సంవత్సరాల విభాగంలో 2023లో స్పెయిన్, 2024లో టర్కీ, కోల్‌కతాలో ఇండియా తరఫున ఆడా. శరీరం సహకరించినంత వరకు ఆడుతుంటా. అలాగే విజయవాడలోని సొంత క్లినిక్‌లో నేటికీ వైద్యుడిగా కొనసాగిస్తున్నా.

- డాక్టర్ సూదగాని రామకృష్ణ, విజయవాడ.

జాతీయస్థాయి పోటీలు హర్షనీయం



కరపత్రం విడుదల చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 3 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఈ నెల 29 నుంచి మొదలయ్యే పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆయన మిర్యాలగూడలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ ఫౌండర్ బూడిద సైదులు, కరాటే మాస్టర్ బానావత్ రామకృష్ణనాయక్ మాట్లాడుతూ పోటీలకు దేశం నలుమూలల నుంచి నుంచి 1000 మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నూకల వేణుగోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 3: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నేటి నుంచి నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కోచ్ తోట రంగారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే అండర్-11 బాలబాలికల పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 200మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టేట్ అసోసియేషన్, డిస్ట్రిక్ట్ అసోసియేషన్ సంయుక్తంగా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కోచ్ మారబోయిన రామకృష్ణ, డాక్టర్ అంజయ్య, నవీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య


రాజు(ఫైల్)

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 3 : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగుచూసింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ జీ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని హైటెక్‌బస్టాండ్ సమీపంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కోడిమళ్ల రాజు(25) ప్రైవేట్‌ఉద్యోగం చేస్తున్నాడు. అయితే కుటుంబంలో కొంతమేర ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. దీంతో మనస్తాపంతో ఈ నెల 1వ తేదీన సాయంత్రం ఇంటి నుంచి బయటకువెళ్లాడు. కుటుంబ సభ్యులు రాత్రి సమయంలో రాజుకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. మరుసటి రోజు కుటుంబసభ్యులు రాజు ఆచూకీ కోసం బంధుమిత్రుల వద్ద ఆరా తీశారు. దీంతో సమాచారం లేకపోవడంతో సోమవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. అయితే మంగళవారం సాయంత్రం సద్దులచెరువులో మృతదేహం తేలి ఉండటాన్ని గమనించిన మత్స్యకారులు పోలీసులకు సమాచారమిచ్చారు. రాజు మృతదేహంగా కుటుంబ సభ్యులు గుర్తించారు. రాజు తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.

పాము కరిచి రైతు మృతి


శంకరయ్య(ఫైల్)

ఆలేరు రూరల్, సెప్టెంబరు 3: వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కరిచి రైతు మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలో జరిగింది. కొలనుపాక గ్రామానికి చెందిన బొడ్డు శంకరయ్య(47) సోమవారం సాయంత్రం వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. చికిత్స కోసం అతడిని ఆలేరులోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడని ఎస్‌ఐ రజినికర్ మంగళవారం తెలిపారు. శంకరయ్యకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉండగా భార్య, కుమారుడు మృతి చెందారు. ఇద్దరు కుమార్తెలకు వివాహాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి..


సత్తయ్య(ఫైల్)

చండూరు, సెప్టెంబరు 3 : డోజర్ వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంతో వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చండూరు పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాస్కానిగూడెం గ్రామానికి చెందిన రైతు వర్కాల సత్తయ్య(65) తన భార్య యాదమ్మతో కలిసి చండూరుకు బైకుపై వస్తున్నాడు. చండూరు శివారులోని శ్మశానవాటిక వద్ద రోడ్డు పక్కన ఉన్న పిచ్చిమొక్కలను తొలగిస్తున్న డోజర్ వాహన డ్రైవర్ నిర్లక్ష్యంతో వాహనాన్ని వెనక్కి నడిపించడంతో అదే సమయంలో బైక్‌పై వస్తున్న సత్తయ్యతో పాటు భార్య యదమ్మకు ఢీకొని బలమైన గాయాలన్నాయి. ఇద్దరిని నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సత్తయ్య మృతి చెందాడు. సత్తయ్య కుమార్తె పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

హైకోర్టు చెప్పినా అందని అర్చకుల వేతనాలు

దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ వేణుగోపాలస్వామి దేవాలయ అర్చకులకు శాపంగా మారింది. తాతల పేరు మీద ఉన్న భూములను దేవాదాయ శాఖకు రిజిస్ట్రేషన్ చేయాలని అధికారులు వేతనాలు నిలిపివేశారు. తమకు జరిగిన అన్యాయంపై అర్చకులు హైకోర్టును ఆశ్రయించి వేతనాల కోసం ఆదేశాలు పొందినా తీర్పును అమలు పర్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఐదేళ్ల న్యాయపోరాటంతో ఐదు నెలల కిందట తమకు అనుకూలంగా తీర్పు వచ్చినా వేతనాల కోసం ఎదురుచూడక తప్పడం లేదు.

- హుజూర్‌నగర్

● పట్టించుకోని దేవాదాయ శాఖ అధికారులు
● ఇబ్బందుల్లో హుజూర్‌నగర్ సీతారామచంద్రస్వామి ఆలయ అర్చకులు



సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం, శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయాలు వేర్వేరుగా ఉన్నాయి. వేణుగోపాలస్వామి ఆలయం పట్టణంలో ఉండగా, సీతారామచంద్రస్వామి ఆలయం ఐదు కిలోమీటర్ల దూరంలోని ఫణిగిరిగట్టుపై ఉంది. 2009 వరకు ఈ ఆలయాలు రికార్డుల్లో వేర్వేరుగా ఉన్నాయి. ఆ తర్వాత ఆలయానికి సంబంధించిన పాలకవర్గాలు, అధికారులు కలిసి రెండు ఆలయాలను ఒకటిగా చేశారు. అప్పటి నుంచి ఫణిగిరిగట్టుపై స్వయంభువుగా వెలిసిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవవిగ్రహాలను పట్టణ నడిబొడ్డున ఉన్న శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో వేంచేయిస్తున్నారు. ఈ సాకుతోనే రెండు దేవాలయాలను విలీనం చేశారని సమాచారం.

మస్కృతి ఇనాం భూములుగా రికార్డుల్లో నమోదుతో..

శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయానికి 627 ఎకరాల భూమి ఉండగా, శ్రీవేణుగోపాలస్వామి దేవాలయానికి 55ఎకరాల భూమి ఉంది. రెండు ఆలయాలకు కలిపి ప్రస్తుతం వారసత్వంగా నరగిరినాథుని భాస్కరాచార్యులు, నరగిరినాథుని మురళీచార్యులు, నరగిరినాథుని నర్సింహాచార్యులు, రంగభట్రాచార్యులు అర్చకులుగా కొనసాగుతున్నారు. దశాబ్దాల కిందట నరగిరినాథుని మురళి, నర్సింహాచార్యులు, భాస్కరాచార్యుల తాత, ముత్తాల కాలంలో మస్కృతి ఇనాం సర్వీస్ భూములను కొంత ఇవ్వగా అప్పుడు రికార్డుల్లో తాతల పేర్లు నమోదుచేశారు. శ్రీవేణుగోపాలస్వామి దేవాలయానికి సంబంధించి అర్చకులుగా(దశాబ్దాల కిందట) పనిచేసిన వారి పేరు మీద 43 రిజిస్ట్రేషన్‌లో 55 ఎకరాల భూమి ఉన్నట్లుగా రికార్డుల్లో తప్పుగా నమోదు చేసినట్లు సమాచారం. వాస్తవంగా అర్చకులు, స్థానాచార్యులు వేర్వేరుగా ఉన్నారు. కానీ స్థానాచార్యులకు సంబంధించిన భూములు సైతం అర్చకుల పేరు మీద పెట్టి 43 రిజిస్ట్రేషన్‌లో పొందుపర్చినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఐదేళ్లుగా వేతనాలు నిలిపివేత

2013 నుంచి రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రస్తుత అర్చకులకు నామమాత్రపు వేతనాన్ని చెల్లిస్తుండేది. ఆ తర్వాత 2018 వరకు దేవాలయానికి వచ్చే ఆదాయం నుంచి నెలకు రూ.6,500లు అందించారు. అనంతరం 2018 నుంచి 2019 వరకు ఎండోమెంట్ శాఖ ప్రతి నెలా ఒక్కొక్కరికి రూ.22వేల చొప్పున వేతనాలు అందించారు. కాగా 2019 నుంచి నేటి వరకు అర్చకులకు వేతనాలు చెల్లించడం లేదు. ఆలయాలను మిళితం చేసే సమయంలో అర్చకుల పేరు మీద 43 రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్న భూములను దేవాదాయ శాఖకు బదలాయించాలంటూ 2019నుంచి అర్చకులకు వేతనాలు నిలిపేశారు. ఇదిలా ఉండగా దేవాదాయ శాఖ రిజిస్ట్రేషన్ చేయాలంటున్న భూమిలో 20ఏళ్ల కిందట కొంత మంది వ్యక్తులు సర్వే నెంబర్లు మార్చి సుమారు 20 ఎకరాలను విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా మిగిలినభూములు అర్చకుల పేరు మీద ఉన్నాయంటూ తప్పుడు రికార్డులు రాశారని అర్చకులు మురళి, భాస్కరాచార్యులు, నర్సింహాచార్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు వేతనం నిలిపివేయడంపై ముగ్గురు 2019లో హైకోర్టును ఆశ్రయించారు. ఐదేళ్లుగా కొనసాగిన విచారణలో భాగంగా అర్చకులకు గతంలో ఇచ్చిన వేతనాల మాదిరి చెల్లించాలని 2023 డిసెంబరులో తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. అనంతరం ఈ ఏడాది మార్చిలో వేతనాలు చెల్లించాలని మరోసారి సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును ఎండోమెంట్ కమిషనర్‌కు అందజేసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఐదేళ్లుగా అర్చకులకు వేతనాలు చెల్లించకపోవడంతో తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూములు ఇస్తామన్నా..

ఇదిలా ఉండగా అర్చకులకు వేతనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు ఎండోమెంట్ భూములకు అర్చకుల వేతనాలకు, తాతల పేర్ల మీద ఉన్న భూములకు సంబంధం లేదని పేర్కొంది. అర్చకత్వం కింద వారికి వేతనాలు ఇవ్వాలని, ఆలయ భూములకు సంబంధించి కలెక్టర్ వద్ద తేల్చుకోవాలని సూచించినా అర్చకులకు వేతనాలు ఇవ్వకుండా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇదిలా ఉండగా అర్చకుల తాతల పేర్ల మీద ఉన్న ఆలయ భూములను దేవాదాయ శాఖకు స్వాధీనం చేస్తామని అర్చకులు హామీ ఇచ్చినా ఎండోమెంట్ అధికారులు జీతాలు ఇవ్వకుండా ఐదేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టు తీర్పును అమలుచేయాలి



ఐదేళ్లుగా వేతనాలు ఇవ్వడంలేదు. వేతనాలు ఇవ్వాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా ఎండోమెంట్ ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు. దీనిపై మరోసారి హైకోర్టును ఆశ్రయిస్తాం. శ్రీవేణుగోపాలస్వామి ఆలయ భూములు మా పేరు మీద ఉన్నట్లుగా తప్పుగా రికార్డుల్లో రాశారు. విచారణ చేయకుండా అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. జీతాలు నిలిపివేసి మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తాత, ముత్తాతల పేరుతో ఉన్న భూములతో సంబంధం లేదు. దేవాదాయ శాఖ అధికారులు పూర్తి విచారణ చేసి వేతనాలు మంజూరు చేయాలి.

- నరగిరినాథుని మురళీచార్యులు

నిర్ణయం ఉన్నతాధికారుల పరిధిలో ఉంది



అర్చకుల వేతనాల విషయం రాష్ట్ర ఎండోమెంట్ అధికారుల పరిధిలో ఉంది. వేణుగోపాలస్వామి ఆలయ భూమి మొత్తం అర్చకుల పేర్ల మీద ఉంది. గతంలో ఎవరు పొరపాట్లు చేశారో ఎలా చేశారన్న విషయం నా పరిధిలో లేదు. 2009కి ముందు కొన్ని రికార్డులు లేవు. శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ రికార్డులు ఉన్నా శ్రీవేణుగోపాలస్వామి దేవాలయ భూముల విషయంలో గందరగోళం జరిగింది.

- కొండారెడ్డి, ఈవో

కస్తూర్బా పాఠశాలను తరలించాలి

ఆదర్శపాఠశాల విద్యార్థినుల ఆందోళన ● ఎమ్మెల్యే హామీతో నిరసన విరమణ



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఆరుబయట విద్యార్థులు

వేములపల్లి, సెప్టెంబరు 3 : తమ హాస్టల్ నుంచి కస్తూర్బా పాఠశాలను వేరేచోటుకు తరలించి సమస్యలను పరిష్కరించాలని నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థినులు మూడు గంటల పాటు ఆందోళన చేశారు. ప్రధానగేట్ వద్ద కూర్చుని లోనికి ఎవరూ వెళ్లకుండా ఆందోళన చేయడంతో అంతసేపు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆరుబయటే ఉండిపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 మంది విద్యార్థుల వసతికి నిర్మించిన హాస్టల్‌లోకి మాడ్గులపల్లి కస్తూర్బా పాఠశాలల విద్యార్థినులు 350మందిని తరలించడం సమంజసం కాదన్నారు. కొద్దిరోజులుగా సుమారు 450 మంది విద్యార్థినులు ఒకేచోట ఇరుకైన గదుల్లో ఉంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రెండు రోజులుగా వర్షాలతో, నీటి సరఫరా సరిగా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. పలుమార్లు అధికారులు కస్తూర్బా పాఠశాలను వేరేచోటుకు తరలిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చినా అమలుచేయలేదన్నారు. విషయం తెలుసుకున్న ఎంఈవో బాలాజీనాయక్ రెండు రోజులు గడువు ఇవ్వాలని, మిర్యాలగూడకు తరలిస్తామని కోరారు. అందుకు విద్యార్థినులు ససేమిరా అంటూ ఆందోళన కొనసాగించారు.

మూడు గంటలు ఆరుబయటే

ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ఉదయం అల్పాహారం చేసిన వెంటనే పాఠశాల ప్రధాన గేటు దగ్గరకు వేసి 9గంటల సమయంలో ఆందోళనకు దిగారు. అప్పటి నుంచి పాఠశాలలోకి విద్యార్థిని, టీచర్లను అనుమతించలేదు. దీంతో వారంతా 3గంటల పాటు రోడ్డు వెంట చెట్ల కింద కూర్చున్నారు. అక్కడకు చేరుకున్న కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు రెమడాల పరుశురాములు విషయాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే విద్యార్థినులతో మాట్లాడి వినాయకచవితిలోగా కస్తూర్బా పాఠశాలను తరలించి సమస్యలు పరిష్కరిస్తామని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

రేషన్‌బియ్యం పట్టివేత

దేవరకొండ, సెప్టెంబరు 3: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం జేత్యతండాలో అక్రమంగా నిల్వ చేసిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నర్సింహులు మంగళవారం తెలిపారు. తండాకు చెందిన కోట్యానాయక్ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ రమేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చండూరు రూరల్ : నల్లగొండ జిల్లా చండూరు మండలం గుండ్రపల్లి అక్రమంగా నిల్వచేసిన 11క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుండ్రపల్లి గ్రామానికి చెందిన వందనపు నరేందర్ తన ఇంట్లో రేషన్ బియ్యం నిల్వచేసినట్లు సమాచారం మేరకు మంగళవారం పోలీసులు తనిఖీలు చేశారు. నిల్వ చేసిన 11 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి సీజ్ చేసి నరేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

వేర్వేరు చోట్ల విద్యుదాఘాతానికి ముగ్గురు మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి చెందారు. నల్లగొండ జిల్లాలో ఇద్దరు, సూర్యాపేట జిల్లాలో ఒకరు మృతి చెందారు. అందులో రైతు, వ్యవసాయ కూలీతో పాటు యువకుడు ఉన్నారు.

దామరచర్ల, సెప్టెంబరు 3 : విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామశివారులో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వీర్లపాలెం గ్రామానికి చెందిన పాతులోతు హాతి(25) విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసే కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కొండ్రపోల్ శివారులో విద్యుత్ స్తంభాన్ని గుంతలో దింపి పైకి ఎత్తిన అనంతరం పలుగుతో సరైన దిశలో తిప్పుతున్న క్రమంలో పైనుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ తీగలకు స్తంభంపైన ఉన్న ఇనుప చువ్వ అంచు తగిలి విద్యుత్ సరఫరా జరిగి హాతి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే తోటి కార్మికులు 108 వాహనంలో మిర్యాలగూడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. హాతికి భార్య అఖిల, మూడు సంవత్సరాల కుమార్తె, ఏడాది వయస్సున్న కుమారుడు ఉన్నారు. హాతి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం హాతి మృతదేహాన్ని మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాయానికి వెళ్లి విద్యుత్‌తెగిపడి రైతు...


వెంకటయ్య (ఫైల్)

కొండమల్లేపల్లి: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లిలో విద్యుత్ తీగలు తెగిపడి కార్మికుడు మృతి చెందాడు. ఎస్‌ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన రైతు రావుల వెంకటయ్య(52) స్థానిక శివగణేష్ కాటన్‌మిల్లుకు పనినిమిత్తం సాయంత్రం నాలుగు గంటలకు వెళ్లాడు. ఈ క్రమంలో మిల్లులో కార్మికులు ఉండే గదిలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా అక్కడే ఉన్న వెంకటయ్యను నిచ్చెన పట్టుకోమన్నారు.ఈక్రమంలో విద్యుత్ తీగలు తెగి వెంకటయ్యపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య అలివేలు, కుమారుడు రమేష్, కుమార్తె అనిత ఉన్నారు.

కొనసాగుతున్న ఆందోళన

మిల్లు యజమాని నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని వెంకటయ్య కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. మిల్లులో మృతదేహాన్ని ఉంచి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ ధనుంజయ్య, కొండమల్లేపల్లి, పీఏపల్లి ఎస్‌ఐలు రాంమ్మూర్తి, నర్సింహులు బాధితులకు నచ్చజెప్పి ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తామని చెప్పినా వారు వినలేదు. మిల్లు యజమాని వచ్చే వరకు ఇక్కడి నుంచి వెళ్లబోమని తేల్చిచెప్పారు. వెంకటయ్య బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా రాత్రి పొద్దుపోయే వరకు ఆందోళన కొనసాగుతోంది.

వాటర్‌హీటర్ పెడుతుండడగా వ్యవసాయ కూలీ..

అనంతగిరి: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని వాయిలసింగారంలో విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాయిలసింగారం గ్రామానికి చెందిన చలకపల్లి చిలకమ్మ(32) వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటుంది. చిలకమ్మ మంగళవారం ఉదయం వరినాట్లకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి స్నానం చేసేందుకు వాటర్‌హీటర్ పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. చిలకమ్మ భర్త సత్యనారాయణ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా చిలకమ్మ కూలీ, నాలీ పనులు చేసుకుంటూ జీవిస్తుందని ఎస్‌ఐ తెలిపారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. చిలకమ్మ మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సులో ఆగిన గుండె

ఆస్పత్రికి తీసుకెళుతుండగా అస్వస్థత


బస్ సీట్‌లోనే ఒరిగిన యాదమ్మ

అర్వపల్లి, సెప్టెంబరు 3: వైద్య పరీక్షలు చేయించుకునేందుకు బయలుదేరిన మహిళ ఆర్టీసీ బస్సులోనే గుండెపోటుతో కన్నుమూసింది. అప్పటిదాకా తమ పక్కన కూర్చున్న మహిళ మృత్యువాత పడడంతో బస్సులోని ప్రయాణికులంతా నిర్ఘాంతపోయారు. మంగళవారం సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలో ఈ ఘటన జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన జటంగి యాదమ్మ (55)కు సోమవారం రాత్రి ఛాతిలో నొప్పిరావడంతో కుటుంబసభ్యులు గ్రామంలోనే ప్రథమ చికిత్స చేయించారు. మంగళవారం ఉదయం వైద్య పరీక్షల కోసం సూర్యాపేటలోని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు తమ గ్రామం నుంచి ఆటోలో ఫణిగిరి స్టేజీ వద్దకు తీసుకొచ్చారు. అదే సమయంలో జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రావడంతో యాదమ్మ, ఆమె కుటుంబ సభ్యులు బస్సు ఎక్కారు. కొంతదూరం రాగానే మార్గమధ్యలో యాదమ్మకు ఆయాసం ఎక్కువైంది. మంచినీరు కావాలంటూ అడిగింది. ఆ సమయంలో ఆర్టీసీ బస్సు జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి రాగానే యాదమ్మ కూర్చున్న సీట్లలోనే గుండెపోటుతో మృతి చెందింది. యాదమ్మ పక్కనే భర్త అవిలయ్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. అయితే ఆర్టీసీ డ్రైవర్ బస్సును ఆపి అర్వపల్లికి చెందిన ఆటోలో యాదమ్మ మృతదేహాన్ని తరలించారు.విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చి పోస్టుమార్టం చేయించాలని చెప్పగా, కుటుంబసభ్యులు వద్దని వాదించారు. అయినా సరే పోలీసులు పంపించాలనడంతో యాదమ్మ మృతదేహాన్ని గంటపాటు ఆటోలోనే ఉంచారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సులో యాదమ్మ మృతి చెందడంతో కుమార్తెల రోదనలు చూసిన స్థానికులు కంటతడి పెట్టారు. యాదమ్మ కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్వపల్లి ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 3 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం జరిపిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. సహస్రనామ పఠనాలతో 1000 తమలపాకులతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాతసేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, సుదర్శన నారసింహహోమం, నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలను నిర్వహించారు. పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేకపూజలు చేపట్టారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి ముఖమండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్యరుద్రహవనం కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.21,09,091 ఆదాయం సమకూరగా అందులో లీజుకు సంబంధించినవి రూ.5,81,181 ఉన్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.


ఆంజనేయస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

చెర్వుగట్టుపై ఘనంగా లక్ష పుష్పార్చన

నార్కట్‌పల్లి : అమావాస్య తిథిని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శైవక్షేత్రం చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి లక్ష పుష్పార్చన వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. తొలుత ప్రధానాలయం నుంచి మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను మహామండపానికి చేర్చారు. ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సహఅర్చకులు లక్ష పుష్పార్చనను కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి చెంత పూజలందుకున్న పూలను తీసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. కార్యక్రమంలో ఈవో నవీన్‌కుమార్, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నాటి జాగ్రత్తతో... నేడు ముంపు

నడిగూడెం, సెప్టెంబరు 3: ఖమ్మం జిల్లా వాసుల తాగునీటి అవసరాల కోసం వేసవిలో తీసుకున్న జాగ్రత్త భారీ వర్షాల సమయంలో నాగార్జునసాగర్ ఎడమకాల్వ గండికి కారణమైంది. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగిత రాంచంద్రాపురం వద్ద ఎడమకాల్వకు భారీ గండి పడేందుకు ఎన్నెస్పీ అధికారుల నిర్లక్ష్యమే కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. గండిపడిన ప్రాంతంలో అత్యవసరంగా తెరవాల్సిన ఎస్కేప్‌ను తెరవకపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. వేసవిలో ఖమ్మం జిల్లా వాసులు తాగునీటి అవసరాల కోసం ఏప్రిల్‌లో సాగర్ ప్రాజెక్టులోని నీటిని ఎడమకాల్వ ద్వారా పోలీస్‌పహారా మధ్య ఖమ్మం జిల్లాకు తరలించారు. ఆ సమయంలో కాల్వ పొడవునా ఉన్న ఎస్కేప్, ఎత్తిపోతలు, మేజర్లు, మైనర్ల తూములన్నింటినీ అధికారులు పోలీసుల సహకారంతో మూసివేయించారు. రైతులు ఎవరూ తూములు తెరవకుండా షట్టర్లు కిందికి దించి తెరుచుకోకుండా వెల్డింగ్ చేయించారు. నీటి విడుదల నిలిపివేశాక అధికారులు వాటిని పట్టించుకోలేదు.

భారీ వర్షాలకు ఒత్తిడి పెరిగి...

వర్షాలకు ఎడమకాల్వలోకి భారీగా వరద చేరడంతో పాటు సాగర్ ప్రాజెక్టు నుంచి కాల్వకు నీటివిడుదల కొనసాగుతుండటంతో కాల్వలపై ఒత్తిడి పెరిగింది. దీంతో మూడు రోజుల కిందట సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరాంచంద్రాపురంలోని ఎడమకాల్వపై 132, 133 కిలోమీటర్ల వద్ద రెండు చోట్ల భారీగా గండ్లు పడ్డాయి. వేసవిలో తూములు, ఎస్కేప్‌లకు వేసిన వెల్డింగ్‌లు తీసివేయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో ఎడమకాల్వ ద్వారా నీరు చేరుకునే పాలేరు వాగు బ్యాక్ వాటర్ వెనక్కి రావడం, కాల్వలో నీటి ఉధృతి ఉండటంతో గండ్లు పడ్డాయి. వరద సమయంలో ఎస్కేప్ తెరవాలన్న ప్రయత్నాలు కూడా చేయకపోవడంతో గండ్లుపడ్డాయని రైతులు ఆరోపిస్తున్నారు. సాగర్ నీళ్లు వదిలాక తూములు వెల్డింగ్ తొలగించి అవి పనిచేసేలా చూడాలని రైతులు, అధికారులను కోరినా నిర్లక్ష్యం చేశారు. ప్రధానంగా ఖమ్మం, సూర్యాపేట జిల్లాల ఎన్నెస్పీ అధికారుల మధ్య సమన్వయం లోపంతో ప్రమాదం సంభవించిందని ఇరుజిల్లాల రైతులు ఆరోపిస్తున్నారు. కాల్వకు నీటిని విడుదల చేస్తున్న సమయంలోనే వెల్డింగ్‌లను తీయాలని సూచించినా పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. ఫలితంగా కాల్వకు గండితో పాటు రెండు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా గండిపడి మూడు రోజులైనా పాలేరు, ఎడమకాల్వకు మంగళవారం నాటికి నీటి ఉధృతి తగ్గినా ఎస్కేప్, తూములను ఎత్తకపోవడం గమనార్హం. వెల్డింగ్‌లు తొలగించి తూములు ఎత్తాలంటే ఎన్నెస్పీ అధికారుల పర్యవేక్షణలోనే జరగాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్కేప్‌కు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


కాగితరాంచంద్రాపురం వద్ద ఎడమకాల్వపై ఎస్కేప్ వద్ద తూములకు చేసిన వెల్డింగ్ (రౌండప్‌లో)

ఎస్కేప్ తెరిచి ఉంటే...

ఎడమకాల్వపై నడిగూడెం మండలం కాగితరాంచంద్రాపురం వద్ద 132-133 కిలోమీటర్ రాయి మధ్య రెండు చోట్ల గండ్లు పడ్డాయి. గండిపడిన ప్రదేశానికి కిలోమీటరు దూరంలోనే ఎస్కేప్ ఉంటుంది. అయితే కాల్వలో నీటి ఉధృతి పెరిగినా, అనుకోని ప్రమాదం జరిగినా ఈ ఎస్కేప్‌ను అధికారులు తెరుస్తుంటారు. ఎస్కేప్ తెరిచి ఉంటే నీరంతా పిల్లకాల్వ ద్వారా సమీపంలోకి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలోని వాగులోకి చేరుతుంది. అక్కడి నుంచి ఈశ్వర్‌మాదారం, రాజాపేట తదితర గ్రామాల ద్వారా ఆయా ప్రాంతాల్లోని వరద వాగుల గుండా మున్నేరు వాగులోకి చేరుకుంటుంది. అదేవిధంగా ఈ కాల్వ ద్వారా వెళ్లే నీటిని సమీపంలోని రైతులు పొలాలకు మళ్లించుకునేవారు. తద్వారా నీటి వృథా తగ్గడంతో పాటు కాల్వపై ఒత్తిడి తగ్గి ఉండేది. గండ్లు పడే అవకాశం లేకుండాపోయేది.

ఆలస్యంగా గండి వెలుగులోకి...

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పరిధిలోని సాగర్ ఎడమకాల్వ ముక్త్యాల 13వ బ్రాంచ్‌కెనాల్‌కు గండిపడిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 1వ తేదీన గండి పడగా అధికారులు ఆలస్యంగా గుర్తించారు. 14వ కిలోమీటర్ వద్ద 30మీటర్ల వెడల్పున కాల్వ కట్టకు గండిపడింది. మునగాల హెడ్‌రెగ్యులేటర్ నుంచి వచ్చే కాల్వకు కుడివైపున గండి పడడంతో హుజూర్‌నగర్ మండలంలోని కరక్కాయలగూడెం ప్రాంతంలోని పొలాలు నీటమునిగి ఇసుక మేటలు వేశాయి. ఈ వరద ప్రవాహం కరక్కాయలగూడెం, మఠ్రిగూడెం ప్రాంతాల మీదుగా బూరుగడ్డలోని నల్లచెరువుకు వరద రావడంతో చెరువు కట్ట తెగింది. దీంతో సుమారు 500ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఇదిలా ఉండగా 13వ బ్రాంచ్ కెనాల్‌పై రెండు రోజుల కిందట 18వ కిలో మీటర్ వద్ద కాల్వ లైనింగ్ కొట్టుకుపోయింది. దీంతోపాటు 22వ కిలో మీటర్ వద్ద పంట పొలాల నుంచి వచ్చిన వరద ప్రవాహంతో రెండు చోట్ల కాల్వకు గండ్లు పడ్డాయి. మొత్తంగా మూడుచోట్ల గండిపడింది.



నక్కలగండి రిజర్వాయర్‌కు భారీగా వరద


రిజర్వాయర్‌లోకి దుంధుబి నది వరద, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 3: నాగర్‌కర్నూల్ జిల్లాలో భారీ వర్షాలతో దుందుభి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దిగువన ఉన్న నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని నక్కలగండి రిజర్వాయర్‌లోకి భారీగా వరదనీరు చేరుతోంది. దీంతో నక్కలగండి, పాతతెల్‌దేవరపల్లి, దేవరచర్ల, యలమలమంద, బొల్లారం గ్రామాలు, తండాలకు భారీగా వరదనీరు చేరి పత్తి పంటలు మునిగిపోయే పరిస్థితి నెలకొంది. రిజర్వాయర్‌లోకి నీరు చేరడంతో అధికారులు దిగువ భాగానికి గేట్లు ఎత్తివేసి నీటిని విడుదల చేస్తున్నారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మంగళవారం రిజర్వాయర్‌ను సందర్శించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరదనీరు తండాల్లోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. వరద బాధితులను పరిహారంతో పాటు అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీరాములు, నీటిపారుదలశాఖ, రెవెన్యూ అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

టెయిల్ పాండ్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

దామరచర్ల : ఎగువన నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని టెయిల్‌పాండ్‌కు మంగళవారం భారీఎత్తున నీరు వచ్చిచేరింది. దీంతో అధికారులు 11 గేట్లను ఐదు మీటర్లు, ఒక గేట్‌ను 2 మీటర్లు ఎత్తి 2,92,950 క్యూసెక్కుల నీటిని దిగువ పులిచింతల ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం : గుత్తా



చెక్కులు అందజేస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 3: ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరుపేదలకు వరం లాంటిందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. 23 మంది లబ్ధిదారులకు జిల్లాకేంద్రంలో తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ పథకం ద్వారా లక్షలాది మంది పేదలకు సహాయం అందుతుందన్నారు. గత ప్రభుత్వం హయాంలో నిలిచిన చెక్కులను విడుదల చేసి సీఎం రేవంత్‌రెడ్డి పేదలకు సహాయం చేశారన్నారు. కార్యక్రమంలో రజిత, ఇంద్రసేనారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సైదులు, సత్యనారాయణ, శ్రీను, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ: సీఎం సహాయనిధి ద్వారా 72లబ్ధిదారులకు మంజూరైన రూ. 18.96లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్సీ ఎంసీకోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ దుర్గంపూడి నారాయణరెడ్డి, రైతుబంధు సమితీ మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టిబాబునాయక్, వీరకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయాలి'

నకిరేకల్, సెప్టెంబరు 3: నకిరేకల్ నియోజకవర్గంలో అత్యధికంగా పార్టీ సభ్యత్వాలు నమోదు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్ర శేఖర్ అన్నారు. నకిరేకల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నకిరేకంటి మొగిలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, మాస శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, గుడుగుంట్ల సాయన్న, చినేని జాని తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: పార్టీ సభ్యత్వ నమోదుకు కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ మండల ఇన్‌చార్జి ఎల్‌వీ. రమణముదిరాజ్ అన్నారు. మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సభ్యత్వ నమోదుకు కష్టపడిన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అవకాశం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మకంటి నరసింహ, గడ్డం వెంకట్‌రెడ్డి, జానకిరాములు, చింత శివప్రసాద్, జాన్‌రెడ్డి, దాసరి నాగరాజు, దారమల్ల నాగరాజు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మీ యాగం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

హాలియా, సెప్టెంబరు 3: హాలియాలోని స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం చివరిరోజు సందర్భంగా మంగళవారం మహాలక్ష్మీ యాగం నిర్వహించారు. ఉదయం విశ్వక్సేరాధాన, వాసదేవ పుణ్యావాహచనం, నవగ్రహదేవత, అనంత నాగదేవత తదితర అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. మూలమంత్ర హోమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గోవర్ధనం శ్రీరామాచార్యులు, స్థానాచార్యులు, రాఘవాచార్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మెడికల్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సిబ్బంది

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 3: తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బంది కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. నాలుగు నెలలుగా వేతనాలు, ఆరు నెలలుగా పీఎఫ్, ఈఎస్ఐ అందడం లేదని వాపోయారు. పది రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. చిన్నపాటి తప్పులకే సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తున్న అధికారులు సమస్యల పరిష్కారం కోసం ఎందుకు చొరవ చూపడం లేదన్నారు. కార్యక్రమంలో డిలలిత, రేణుక, అండాలు, సంధ్య, మంగమ్మ, సైదమ్మ, లక్ష్మీ, చంద్రమ్మ పాల్గొన్నారు.

కుల గణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దీపేందర్

నల్లగొండ టౌన్ సెప్టెంబరు 3: రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు 42శాతం పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ కోరారు. జిల్లాకేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పష్టమైన హామీ ఇచ్చినందున తక్షణమే సమగ్ర కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యలిజాల వెంకటేశ్వర్లు, బోళ్ల నాగరాజు, అనిల్ చెర్రీ పాల్గొన్నారు.

టీఎస్ పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నిక



కేతావత్ మూనా, రెడ్డిమణి అనిల్

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 3: టీఎస్ పీఆర్‌టీయూ మండల కమిటీని అక్కంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేతావత్ మూనా, మహిళా ఉపాధ్యక్షురాలిగా తీగల శ్రీవిద్య, ప్రధాన కార్యదర్శిగా రెడ్డిమణి అనిల్, అసోసియేట్ అధ్యక్షుడిగా రాయికంటి సైదులు, కార్యదర్శులుగా మజ్జిగపు శ్రీనివాస్, పాదూరి హుస్సేన్, నోముల నగేష్, మహిళా కార్యదర్శిగా పాదూరి మణెమ్మ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్య క్షుడు మూనా మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల అధికారులుగా మంచికంటి మధు, మొక్కా పరుశురాంగౌడ్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాశం నారాయణరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చందర్‌నాయక్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పరమేష్‌యాదవ్, పత్తిపాటి తిరుమలరావు, మోతీలాల్, మంగ తదితరులు పాల్గొన్నారు.

'మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి'

మునుగోడు, సెప్టెంబరు 3: గణేష్ మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహ ణకు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని చండూరు సీఐ వెంకటయ్య తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ అంజయ్యప్రజాపతి పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు కోరారు. పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండపం వద్ద సీసీ కెమెరాలు, రాత్రిపూట కాపలా ఉండాలన్నారు.

కట్టంగూరు: నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ ఎన్. శ్రీను అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వినాయకుడిని ప్రతిష్ఠించే వారు అనుమతి తీసుకోవాలన్నారు.

చింతపల్లి: గణపతి మండపాల నిర్వాహకులు అనుమతి తీసుకోవాలని ఎస్ఐ యాదయ్య కోరారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. డీజే వంటి సౌండ్‌బాక్స్‌లను వినియోగించకుండా మండపాల వద్ద నాణ్యత కలిగిన మైక్‌లు ఏర్పాటు చేసుకోని నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కూలి చేసినా పైసలు ఇవ్వలే

- నగదు చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం
- అడిగితే దురుసుగా తపాలా సిబ్బంది సమాధానం
- డబ్బులున్నా ఇవ్వడం లేదని ఉపాధి కూలీల ఆవేదన



కొండమల్లేపల్లిలోని తపాలా కార్యాలయం

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 3: కొండమల్లేపల్లి పట్టణానికి సంబంధించి ఉపాధి హామీ కూలీల డబ్బుల చెల్లింపులో తపాలా శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉపాధి హామీ కూలీలు వాపోతున్నారు. కొండమల్లేపల్లి పట్టణంలో మొత్తం 722మందికి జాబ్ కార్డులు ఉండగా 443మంది కూలి పనులకు వెళ్తుంటారు. వీరికి మే, జూన్ నెలలకు సంబంధించిన డబ్బులు ఒక్కొక్కరికి రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ఇటీవల వారి ఖాతాల్లో జమ అయ్యాయి. ఇంతవరకు బాగానే ఉన్నా స్థానిక తపాలా కార్యాలయంలో ఐపీపీబీ(ఇండియన్ పోస్టర్ పేమెంట్ బ్యాంక్) సిబ్బంది లేకపోవడంతో ఉపాధి కూలీలకు నగదు పంపణిలో తీవ్ర జాప్యం అవుతోంది. పలువురు ఉపాధి కూలీలు సోమవారం తపాలా కార్యాలయానికి వెళ్లి తమకు డబ్బులు చెల్లించాలని అక్కడున్న సిబ్బందిని అడిగారు. 'మేం చుట్టు పక్కల గ్రామాల్లో విధులు నిర్వహిస్తాం, కొండమల్లేపల్లికి చెందిన కూలీలకు నగదు చెల్లించే బాధ్యత మాకు లేదు, మా వీలునప్పుడు పంపిణీ చేస్తాం' అని దురుసుగా సమాధానం ఇచ్చినట్లు కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎస్‌పీఎం హే మ్లాను వివరణ కోరగా స్థానిక తపాలా కార్యాలయంలో పట్టణానికి చెందిన సిబ్బంది లేకపోవడంతో వేరే గ్రామాలకు చెందిన సిబ్బందితో నగదు పంపిణీ చేస్తున్నామని, ఈ క్రమం లో జాప్యం జరుగుతోందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ఈ రహ'దారులు' బాగుపడవా?

శాలిగౌరారం, సెప్టెంబరు 3: భారీ వర్షాలకు మండలంలోని పలు ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతుల చేయించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీరాజ్ విభాగానికి చెందిన శాలిగౌరారం నుంచి బైరవునిబండ గ్రామం వరకు, చిత్తలూరు నుంచి గురజాల వరకు, శాలిగౌరారం బస్ స్టేజీ నుంచి దొనబండ గ్రామం వరకు ఉన్న రోడ్లపై పెద్దపెద్ద ఏర్పడ్డాయి. వర్షం నీటితో కుంటలను తలపిస్తున్నాయి. ఆర్అండ్‌బీ రోడ్లకు సంబంధించి రామగిరి నుంచి గురజాల గ్రామం వరకు, వంగమర్తి నుంచి చిత్తలూరు గ్రామం వరకు, శాలిగౌరారం నుంచి కురమర్తి వరకు ఉన్న రోడ్లు రూపు రేఖలు పూర్తిగా మారిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు వెంటనే ఈ రోడ్లను పరిశీలించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



దొనబండ నుంచి శాలిగౌరారం వెళ్లే రోడ్డు, శాలిగౌరారం నుంచి బైరవునిబండ గ్రామాలకు వెళ్లే రోడ్డు పరిస్థితి

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

డిండి, సెప్టెంబరు 3: భారీ వర్షాలు, వరదలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. డిండిలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేలు, వర్షాలకు మృతిచెందిన వారికి కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా కింద రూ.5లక్షలు అందజేస్తుందని తెలిపారు. వరదల నుంచి ప్రజలను ఆదుకోవడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. డిండి వాగులో చిక్కుకున్న వారిని బయటకు తీసిన నల్లగొండ, నాగర్‌కర్నూల్ అధికారులు చూపిన చొరవను ఆయన అభినందించారు. భారీ వర్షాల కారణంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల వల్ల వాటిల్లిన నష్టంపై అన్ని శాఖలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాథమిక అంచనాలు రూపొందించాలని సూచించారు. డిండి ప్రాజెక్టు నీటితో చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని అన్ని చెరువులు, కుంటలు నింపుతామన్నారు. డిండి రిజర్వాయర్ వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, వెంకటేశ్వరరావు, గుర్రం రాములు, పోలం లక్ష్మణ్, బాదమోని శ్రీనివాస్‌గౌడ్, మేకల కాశయ్య, గడ్డమీది సాయి, పోల వెంకటేష్, శైలేజ్, బద్దెల శ్రీను, తుమ్మల లక్ష్మారెడ్డి, కీలం పాల్గొన్నారు.

పెరిక గోపాల్ సేవలు చిరస్మరణీయం



పెరిక గోపాల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 3: నల్లగొండ పట్టణ అభివృద్ధికి డీసీసీ మాజీ అధ్యక్షుడు పెరిక గోపాల్ చేసి సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. పెరిక గోపాల్ 23వ వర్ధంతి పురస్కరించుకుని ప్రకాశం బజారులో గల పెరిక గోపాల్, పెరిక రాజరత్నం విగ్రహాలకు మంగళవారం పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ కుమారులు ఉమామహేశ్వర్‌రాజు, పెరిక కరణ్ జయరాజ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొర్ర సుధాకర్, పసల శౌరయ్య, పడిదల నవీన్‌కుమార్, వడ్డెబోయిన సైదులు, సింగం శ్రీకాంత్, శ్రవణ్, నవీన్, మహేష్, పెరిక చిట్టి, సత్యం, వేణు పాల్గొన్నారు. అనంతరం పెరిక గోపాల్ రాజరత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ జాతీయ అధ్యక్షుడు పెరిక కరణ్‌జయరాజ్ ఆధ్వర్యంలో రామగిరిలోని మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్‌లోని అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్‌రెడ్డి, పసల శౌరయ్య, విలియమ్స్, దుబ్బ పరమేష్, వడ్డెబోయిన సైదులు, ఎద్దు రమేష్, పెరిక రాజు, శ్రవణ్, కొండేటి మహేష్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మాడ్గులపల్లిలో భోజనం పరిశీలిస్తున్న సీహెచ్‌వో చంద్రప్రకాష్

మాడ్గులపల్లి, సెప్టెంబరు 3: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సీహెచ్‌వో చంద్రప్రకాశ్ అన్నారు. మండలం లోని కుక్కడం గ్రామంలో గల కేజీబీవీ స్కూల్‌ను మంగళవారం సందర్శించారు. వంట గదిని, బాత్‌రూమ్‌లను పరిశీలించారు. తాజా కూరగాయలతో నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సోమాచారి, ఏఎన్ఎంలు ఝాన్సీ, ఝాన్సీ, ఉపాధ్యాయురాలు ఉమా, సునీత, ఆశా కవిత ఉన్నారు.

వేములపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌వో చంద్రప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిర్వహించిన పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరాన్ని మంగళవారం పరిశీలించారు. పలువురి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. తమ ఇంటి పరిసరాల్లో మురుగునీరు, మురుగులేకుండా జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు ప్రబలవన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో విష జ్వరాలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా ప్రబలుతున్నందున ఎవరికైనా జ్వరం లక్షణాలుంటే పీహెచ్‌సీకి వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రవణ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ రామాచారి, శైలజ, విఘ్నేశ్వరి, రాధిక, ప్రేమలత పాల్గొన్నారు.

శాలిగౌరారం: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో డాక్టర్లు ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కస్తూర్బా గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు.

సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం



దేవరకొండలో బైక్ ర్యాలీకి స్వాగతం పలుకుతున్న నాయకులు

దేవరకొండ, సెప్టెంబరు 3: రాష్ట్రంలోని సంక్షేమ హస్టల్‌లు, గురుకుల పాఠశాలల విద్యార్థులు ఎలుకలు కరిచి అస్వస్థతతో ఇబ్బందులుపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, కంభంపాటి శంకర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీ నాంపల్లి, చింతపల్లి, కొండమల్లేపల్లి మీదుగా మంగళవారం దేవరకొండకు చేరుకుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ హస్టల్‌ల విద్యార్థులకు సదుపాయాలు కరువయ్యాయన్నారు. హస్టల్ విద్యార్థులకు సరిపడా భోజనం అందజేయడంలేదన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హస్టల్‌ల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గ ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్‌నాయక్, బుడిగ వెంకటేష్, కాశ్య, సైదానాయక్, రమేష్, స్పందన తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్‌ల పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీ మంగళవారం కొండమల్లేపల్లికి చేరుకుంది. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహిళా కోకన్వీవనర్ కుంచం కావ్య, రమావత్ లక్ష్మణ్‌నాయక్, కుర్ర సైదా, బుడిగవెంకటేష్, కోరే రమేష్, ముస్కు రవీందర్, జగన్, వీరన్న, సాయి, పావని, మౌనిక, స్పంద, రవి పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

శాలిగౌరారం, సెప్టెంబరు 3: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో కె. వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. గర్భిణులు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకొని పౌష్టికాహారం తీసుకున్నప్పుడే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా పుడతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి, మండల వైద్యాధికారి సూర్యశిల్ప, పీహెచ్ఎన్ రాములమ్మ, సూపర్‌వైజర్ మరియా, చార్టర్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, డెంకల సత్యనారాయణ, చామల మహేందర్‌రెడ్డి-అరుణ, దునక వెంకన్న, గుండ్ల రామ్మూర్తి, మురారిశెట్టి కరుణాకర్, వావిలాల రామలింగయ్య శర్మ, మద్ది వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సాయం చేసే వారిపై దాడులు సరికాదు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 3: సాయం చేసే వారిపై కాంగ్రెస్ నాయకులు రాళ్ల దాడులు చేస్తున్నారని జిల్లా గ్రంథాయల మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో వరద బాధితులను పరామర్శించి సాయం చేయడానికి వెళ్లి బీఆర్ఎస్ మాజీమంత్రులపై రాళ్ల దాడులు చేయడం ఆక్షేపనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఖమ్మంలో ఉన్న సమయంలోనే ఈ దాడులు జరిగాయన్నారు. తెలంగాణ సాధనలో ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర బీఆర్ఎస్‌ది అన్నారు. దాడుల సంస్కృతి బీఆర్ఎస్‌ది కాదని, రాష్ట్రం అభివృద్ధే ఏకైక లక్ష్యమన్నారు.

'విష జ్వరాల నుంచి ప్రజలను కాపాడాలి'

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 3: జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి, విష జ్వరాల నుంచి ప్రజలను కాపాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారీ ఐలయ్య డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం కోసం సంచార వైద్య బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలకు డెంగీ, టైఫాయిడ్, మలేరియా పరీక్షలు నిర్వహించి మందులు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బొజ్జ చిన్న వెంకులు, దండంపల్లి సరోజా, కత్తుల లింగస్వామి, మన్నె బిక్షం. తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిస్థితి దయనీయం : ఏబీవీపీ

రామగిరి, సెప్టెంబరు 3: రాష్ట్రంలో విద్యారంగ పరిస్థితి అత్యంత దయనీయంగా మరిందని ఏబీవీపీ కన్వీనర్ సురభి మణికంఠ ఆరోపించారు. స్థానిక సంఘం కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పాలకులు మారినా ప్రజల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలకు ప్రభుత్వం తుట్లా పొడుస్తోందన్నారు. జిల్లా కన్వీనర్ సంపత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులతో చలగాటం ఆడుతోందన్నారు. కార్యక్రమంలో విభాగ్ హాస్టల్ కన్వీనర్ తానాజీ, నిఖిల్, మల్లేశ్, చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

చెరువులు, కుంటలకు జలకళ



వర్షానికి నిండి అలుగు పోస్తున్న కేతేపల్లి నిమ్మలమ్మ చెరువు

కేతేపల్లి, సెప్టెంబరు 3: మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటల్లో జలకళ సంతరించుకుంది. గత వేసవిలో మండలంలోని మూసీ ఆయకట్టేతర గ్రామాల చెరువులు, కుంటలు ఖాళీ అయ్యాయి. అప్పటి నుంచి నీటి చుక్కలేక బీళ్లుగా ఉన్న చెరువులు, కుంటలు ప్రస్తుతం వరద నీటితో పొంగి పొర్లుతున్నాయి. మూసీ కుడికాల్వ ఆయకట్టు పరిధిలోని గ్రామాల చెరువులు, కుంటలు ఇప్పటికే నిండి ఉండగా గత జూన్ నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో మండలంలో మూసీ ఆయకట్టేతర గ్రామాల చెరువులు, కుంటలు ఇటీవలి వరకు నీరు లేక వెలవెలబోయాయి. బావులు, బోర్లలో నీరు అడుగంటి ఈ ఏడాది వరి సాగు తగ్గింది. వర్షాలు కురవకపోతాయా- అన్న ఆశతో బావులు, బోర్ల వచ్చిన కొద్దిపాటి నీటితో రైతులు సాగు చేసిన వరి పంట వానలు లేక ఎండిపోయే దశకు చేరింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఇనుపాముల, గుడివాడ, కొర్లపహాడ్, కేతేపల్లి, బండపాలెం, కొండకింది గూడెం చెరువులు, కుంటలు నిండాయి. మూసీ ప్రాజెక్టుకు 6,277 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. 1,244 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

నాగార్జునసాగర్: హిల్‌కాలనీలోని బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు కలుషిత ఆహారం పెడుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సుమారు 1,400మంది విద్యార్థులు ఇక్కడ విద్యన భ్యసిస్తుండగా, కలుషిత ఆహారం పెడుతున్నారని, పదుల సంఖ్యలో ప్రభు త్వాసుపత్రికి వెళుతున్నారని ఫోన్‌లో తెలిపారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్‌ను వివరణ కోరగా, సీజనల్ వ్యాధులతోనే విద్యార్థులు ఆసుపత్రికి వెళుతున్నారని, ప్రతిరోజు పరిశీలించాకే ఆహారం వడ్డిస్తున్నట్లు తెలిపారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలోని కొత్తబావి గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన శానిటేషన్, ప్లాంటేషన్ పనులకు ప్రత్యేక అధికారి సుమానంద్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో సీజేఎస్.రావు, కొండమల్లేపల్లి, కొత్తబావి పంచాయతీ కార్యదర్శులు డాకునాయక్, నర్సింహులు ఉన్నారు.

నకిరేకల్: నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్ కోరారు. నకిరేకల్‌లోని వడ్డెర బస్తీ మొండివారి కాలనీ, ఎస్సీ కాలనీలో వరదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలు వస్తున్నందున ప్రజలు బయటకు రావద్దని మున్సిపాలిటీ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట వంటెపాక అంబేడ్కర్, బొంత శ్రీను, మామిడికాయల నాగయ్య, పెద్దులు, సోమయ్య, పందిరి సతీష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయ పాలక మండలి పదవీకాలం ముగిసింది. గతేడాది చైర్మన్‌గా అల్గుబెల్లి నర్సిరెడ్డి మరో 14 మంది పాలకమండలి సభ్యులుగా బాధ్యతలు చేపట్టారు. సోమవారం వీరి పదవీకాలం ముగిసిందని ఆలయ ఈవో జయరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కనగల్: జిల్లాకేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈ నెల 10, 11వ తేదీల్లో రెండు రోజులపాటు అండర్ -14, అండర్-17 విభాగాల్లో జరిగే వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలకు మండలం నుంచి పంపే

సంక్షిప్త సమాచారం..

విద్యార్థుల ఎంపికలో భాగంగా శుక్రవారం కనగల్ హైస్కూల్‌లో ఎంపిక పోటీలను నిర్వహిస్తామని ఎంఈవో తరిరాములు, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నర్సిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని బంజారకాలనీలో ఎస్సీ బాలికల వసతిగృహంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. బొడ్డుపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ విజయ ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, డాక్టర్‌లు వసతిగృహంలోని విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ బాలికల వసతిగృహ వార్డెన్ రుణదేవి, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ మనోహర్, హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, కవిత, గౌస్, ఆశావర్కర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శిగా మండలకేంద్రానికి చెందిన వల్లవాయి అశోక్ ఎన్నికయ్యారు పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నుంచి నియామకపత్రం అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

నల్లగొండ: ఖమ్మం జిల్లాలో వరద బాధితులను పరామర్శించి సహాయం చేయడానికి వెళ్లిన వారిపై దాడి చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మాజీమంత్రుల కార్లపై రాళ్ల దాడి చేయడాన్ని ఖండించారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర బీఆర్ఎస్‌దని గుర్తుచేశారు.

చింతపల్లి: అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సూపర్‌వైజర్లు సుగుణ పార్వతి అన్నారు. చింతపల్లి 4వ, మదనాపురం, ప్రశాంతిపూరి తండా అంగన్వాడీ కేంద్రాల్లో పోషణమాసం సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు పద్మవాతి, మమత, నీలావతి, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ కల్చరల్: పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు ఈనెల 8వ తేదీన నల్లగొండలో పౌరసన్మానం నిర్వహించనున్నట్లు సాహితీ సామాజిక సేవా సంస్థ బాధ్యులు దాసోజు శ్రీనివాస్, సత్యనారాయణచారి, పేందోట సోములు ఒక ప్రకటనలో తెలిపారు. పౌరసన్మానికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కులూరు లక్ష్మణ్, వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ హాజరవుతున్నారని తెలిపారు. కవులు, కళాకారులు, సాహితీ వేత్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చిట్యాలరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాసం కార్యక్రమాలను ఆయా గ్రామాల్లో ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో కలిసి అంగన్‌వాడీ టీచర్లు ప్రదర్శన నిర్వహించారు. పోషక విలువలున్న ఆహార పదర్థాలపై గర్భిణులు, బాలింతలకు వివరించారు. నిత్యం పోషకాహారాన్ని భుజించాలని, పాలు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలతో పాటు సంపూర్ణ ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనగాం స్వామి, సాయి, మహేష్, లక్ష్మి పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: మండలంలోని ఏపూర్, పేరేపల్లి గ్రామాల్లో జెడ్పీహెచ్ఎస్, యూపీఎస్ పాఠశాలల్లోని విద్యార్థులకు దివీస్ లాబొరేటరీస్ పరిశ్రమ సౌజన్యంతో రూ. 4.72లక్షల విలువైన బ్యాగులు, నోట్ బుక్కులు, వాటర్‌బాటిళ్లు, సాండిల్స్‌లను పంచాయతీ కార్యదర్శులు డి. మల్లేష్, అహల్యలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి. రజిత, జి. అంజయ్య, దివీస్ ప్రతినిధులు జి. వెంకటేశ్వర్లు, సాయికృష్ణ పాల్గొన్నారు.

